

తైక్వాండోలో రోహిత్‌కుమార్‌కు బంగారు పతకం

జాతీయ పోటీలకు ఎంపిక



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల కడప జిల్లా రైల్వే కోడూరులో జరిగిన అండర్ 19 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో నెల్లిమర్ల కు చెందిన కోల రోహిత్ కుమార్ విజయనగరం జిల్లా తరుపున78 కేజీ ల విభాగంలో పాల్గొని ఉత్తమ క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటిల్లో ప్రథమస్థానం పొంది గోల్డ్ మెడల్ సాధించాడు. ఈనెల 20 నుంచి 24 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్ దేవాస్ లో జరగబోయే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరుపున పాల్గొంటాడని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కోచ్ ఎన్.రవి తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన రోహిత్ కుమార్‌ను డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు, పీడీ కోల లక్ష్మణ్ అభినందించారు.

మళ్లీ భూముల రీ సర్వే

- ప్రయోగాత్మకంగా మండలంలోని ఒక రెవెన్యూ గ్రామం
- 200 నుంచి 300 ఎకరాలకు ఒక సర్వే బృందం
- ఒక్కో రెవెన్యూ గ్రామానికి 120 రోజులు సమయం
- 27 గ్రామాల్లో ప్రారంభమైన సర్వే



రావాడలో హద్దులను గుర్తిస్తున్న సర్వే బృందం

ప్రజాశక్తి - భోగాపురం

రీసర్వే పక్కాగా చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయోగాత్మకంగా రీసర్వే చేయాలని నిర్ణయించింది. ఇందుకు గాను జిల్లాలో ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. ఈ గ్రామాల్లో గత ప్రభుత్వం హయాంలో జరిగిన తప్పులు మళ్ళీ జరగకుండా చూడాలని పేర్కొంది. దీంతో జిల్లాలో 27గ్రామాల్లో త్వరలో రీసర్వేకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో కూడా ప్రారంభించారు. ఈసారి ఒక రెవెన్యూ గ్రామం రీసర్వే చేసేందుకు 120రోజులు అవకాశం ఇచ్చారు. అలాగే ఉమ్మడి ఎన్‌పిఎమ్‌లు లేకుండా రైతుకు అనుకూలంగా రీసర్వే చేసేందుకు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రీసర్వేను ప్రారంభించినప్పటికీ రైతులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఒకరి భూమి వేరొకరి పేరున నమోదు చేయడం, మ్యుటేషన్‌కు అవకాశం లేకుండా పోవడంతో రైతులంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమ అవసరాలకు భూములను సైతం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఎల్‌పిఎమ్‌లతో వన్‌బిలు రాక అవస్థలు పడుతున్నారు దీంతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేలా ఇప్పటికీ తిరుగుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక ఎల్‌పిఎమ్‌లు విడదీసేందుకు అవకాశం కల్పించారు.

ప్రతి మండలంలో ఒక రెవెన్యూ గ్రామంలో రీసర్వే

మండలంలోని ఒక రెవెన్యూ గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంచుకున్నారు. మొత్తం 27 గ్రామాల్లో రీసర్వే కు సిద్ధమవుతున్నారు.గత ప్రభుత్వం హయాంలో సర్వే సిబ్బంది ఒత్తిడి వలనే లోపాలు జరిగినట్లు సాక్షాత్తు సర్వే సిబ్బంది చెబుతున్నారు. ముఖ్యంగా ఒక బృందం రోజుకు కేవలం పది ఎకరాలు వరకు పక్కాగా చేయగలదు. కాని ఒక్కో బృందానికి ఏకంగా 20 ఎకరాలు పైబడి సర్వే చేసి వివరాలను సైతం పొందు పరచాలని గత ప్రభుత్వం సూచించింది. సకాలంలో రైతులు కూడా హాజరు కాలేకపోవడంతో ఇష్టానుసారంగా జరిగిపోయింది. రీసర్వేకు సమయాన్ని కూడా ఎక్కువ రోజులు ఇచ్చేవారు కాదు. దీంతో ఇలాంటి తప్పిదాలు వలన రీసర్వే లోపాలు వెలుగుచూశాయి. కాని ఉన్నతాధికారులు మాత్రం ఇవేమి పట్టించుకోలేదు. కేవలం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలనే ధ్యేయంగా పనిచేశారు.

లోపాలు లేకుండా రీసర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశం

టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక రీసర్వే లోపాలపై ఇది వరకే రెవెన్యూ సదస్సులను కూడా ప్రభుత్వ నిర్వహించింది. ఎక్కువగా ఎల్.పి.ఎమ్‌ల సమస్యలు, ఒకరి భూమి మరొకరి పేరుమీద ఉండడం, విస్తీర్ణం హెచ్చు తగ్గులు వంటి ఫిర్యాదులు అందాయి. ఇలాంటి సమస్యలు లేకుండా రీసర్వే చేయాలని నిర్ణయించారు. ఈసారి ఉమ్మడి ఎల్‌పిఎమ్‌ల స్థానంలో ఒక్కొక్కరికి ఒక్కో ఎల్‌పిఎమ్ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు సమాచారం. అలాగే ప్రతి 200 నుంచి 300 ఎకరాలను ఒక బ్లాక్ గా విభజించి ఒక సర్వే బృందాన్ని నియమిస్తారు. ప్రతి సర్వే బృందంలో ఇద్దరు గ్రామ సచివాలయ సర్వేయర్లు, విఆర్ఒ, విఆర్ఎ ఉంటారు. ముందుగా గ్రామ హద్దులు సర్వే చేసిన అనంతరం ప్రభుత్వ భూములను సర్వే చేస్తారు. ఆ తరువాత గ్రామసభ నిర్వహించి రైతులకు నోటీసులు జారీచేసి సర్వే చేయనున్నారు.

రైతులు పూర్తిగా సహకరించాలి

రైతులు పూర్తిస్థాయిలో సహకరిస్తే రీసర్వే సక్రమంగా జరుగుతుంది. సర్వే చేసే సమయంలో ఖచ్చితంగా రైతులు హాజరుకావాలి. అందుకు ముందుగా గ్రామసభ నిర్వహించి రైతులకు నోటీసులు జారీ చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే బృందాలను కూడా నియమించారు. రావాడ రెవెన్యూ రీసర్వే ప్రారంభించాం.

ఎమ్.సురేష్, తహశీల్దారు, భోగాపురం

ఎస్‌సి ఉపకులాల స్థితిగతులపై కమిషన్ ఆరా

పలు శాఖల అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా

ప్రజాశక్తి-విజయనగరం కోట

షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. షెడ్యూల్డ్ కులాల వారీగా వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా స్థితిగతులపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆయా కులాలు పొందిన లబ్ధిని తెలుసుకున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎస్‌సిల్లో ఉప కులాల వారీగా వెంటనే వివరాలను అందజేయాలని కోరారు. పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, విద్యుత్, పోలీసు తదితర పెద్ద శాఖల్లో పనిచేస్తున్న ఎస్‌సిల వివరాలను తెలుసుకున్నారు. డ్వాక్రా సంఘాల సభ్యుల్లో ఎస్‌సిల వివరాలపై ఆరా తీశారు. వారికి ఏయే పథకాల ద్వారా లబ్ధి చేకూరిందో ప్రశ్నించారు. పార్వతీపురం మన్యం జిల్లా గురించి కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తమ కమిషన్ రంజన్ మిశ్రా ఏర్పాటయ్యిందని చెప్పారు. ఇది చాలా కీలకమైన సమావేశమని, ఖచ్చితమైన అంకెలతో సమగ్రంగా వివరాలను అందజేయాలని ఆదేశించారు. జిల్లా వారీగా సమావేశాలను నిర్వహించి, ఎస్‌సి ఉపకులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను, వివిధ వర్గాల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని చెప్పారు. ఎస్‌సిల్లో ఉన్న 59 ఉప కులాల స్థితిగతులను అధ్యయనం చేయనున్నట్లు కమిషన్ తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాస మూర్తి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, సోషల్ వెల్ఫేర్ డిడి బి.రామానందం, మన్యం జిల్లా డిడి గయారుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

ఉపకులాల సంఘాల నుండి 101 వినతులు

ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో వినతులు స్వీకరించారు. ఎస్‌సి వర్గం లో నున్న ఉపకులాలకు చెందిన 101 సంఘాల నుండి వినతులు అందాయి. ప్రధానంగా కొన్ని వర్గాలు వర్గీకరణ వద్దని, మరికొన్ని సంఘాలు వర్గీకరణ అవసరం అని వినతులు సమర్పించారు. ఉప కులాల గణన జరపాలని , ఏ కులం వారు ఎంత మంది ఉన్నారు, వారి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయాలని ,ఆ తర్వాతే వర్గీకరణ జరపాలని కోరారు ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రాలను ప్రతి ఏడాది పొందడం కష్టంగా ఉందని, ఐదేళ్లకు ఒక సారి తీసుకోడానికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి, సోషల్ వెల్ఫేర్ డిడి రామానందం, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంట్ పరీక్షలకు ఏర్పాట్లు : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-విజయనగరంకోట

డిపార్ట్‌మెంట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న శాఖాపరమైన పరీక్షలకు చేయాల్సిన ఏర్పాట్లపై తమ ఛాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని డిఆర్‌ఒ చెప్పారు. జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఎంవిజిఆర్, లెండి, సీతం, అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 10 గంటలు నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటలు వరకు జరుగుతాయని చెప్పారు. అభ్యర్థులు తమతోపాటు తప్పనిసరిగా ఒరిజనల్ గుర్తింపు కార్డును తీసుకురావాలని, లేదంటే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరగదని ఆయన స్పష్టం చేశారు. అనుమతి పొందిన వికలాంగులు స్క్రైబ్‌ను తామే తెచ్చుకోవాలని డిఆర్‌ఒ సూచించారు. తమతోపాటు సెల్‌ఫోన్లు, స్మార్ట్ వ్యాచ్‌లు, ఇతర ఏవిధమైన ఎలక్ట్రానిక్ పరికరాలకూ అనుమతి లేదని సూచించారు. సమావేశంలో పరీక్షల సూపరింటెండెంట్ భాస్కరరావు, ఎపిపిఎస్‌సి ప్రతినిధులు యోగేశ్వరరావు, చంద్రరావు, పలుశాఖల అధికారులు, చీఫ్ సూపరింటెం డెంట్లు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

20న క్రీడా శాఖ మంత్రి రాక

విజయనగరంకోట : రాష్ట్ర రవాణా క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఈనెల 20న జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి ఆరోజు మధ్యాహ్నం 1 గంటకు విశాఖ నుంచి జిల్లాకు చేరుకొని జిల్లా కేంద్రంలో విజ్జి స్టేడియంను ప్రారంభించ నున్నారు. మధ్యాహ్నం 4గంటలకు పార్వతీపురం వెళ్లనున్నారు.

జెఎన్‌టియు, బోట్స్ ఎస్‌ఆర్ మధ్య ఒప్పందం

విజయనగరం టౌన్ : జెఎన్‌టియు గురజాడ యూనివర్శిటీ, బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్-సదరన్ రీజియన్ (బోట్స్-ఎస్ఆర్), కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ఉన్నత విద్యా విభాగం ఆధ్వర్యంలో ఒక కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పంద పత్రాలను జెఎన్‌టియు జివి రిజిస్ట్రార్ జి.జయసుమా, బోట్స్-ఎస్ఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ పాల్ ఎడ్వర్డ్‌జి అందజేసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ ఆర్.రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్ జిజె నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంపుదలే లక్ష్యం

రూ.156.93 కోట్లతో నగర పాలక సంస్థ బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆదాయం పెంచడమే లక్ష్యంగా మంగళవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆస్తిపన్ను, విలీన ప్రాంతాల్లో పన్ను విధించడం, షాపులు అద్దెలు, ట్రేడ్ లైసెన్స్ వంటివి ఎక్కువగా విధించి ఆదాయం పెంపుదల లక్ష్యంగా నిర్ణయాలు చేశారు. మంగళవారం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.156.93 కోట్లతో 2025-26 సంవత్సరానికి నగరపాలక సంస్థ అధికారులు ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌ను సభ ఆమోదించింది. అందరి సహకారంతో నగర అభివద్ధిని సాధించడమే కౌన్సిల్ ముఖ్య ఉద్దేశమని నగర మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. నగర ప్రజలకు అన్ని రకాల సదుపాయాలను కల్పించేందుకే ఈ బడ్జెట్ రూపకల్పన చేశామన్నారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మీడియా తో మాట్లాడుతూ ప్రజల నుండి స్వచ్ఛంద విరాళాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు (సిఎస్‌ఆర్) ఏర్పాటు చేస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. రూ.72.45 కోట్లతో నగర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. రూ.10 కోట్ల సాధారణ నిధులతో కొత్తగా రోడ్లు వేయడం, రూ.12 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం, కోటి రూపాయలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, రూ.1.50కోట్లతో పట్టణ సుందరీకరణ నిమిత్తం బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు తెలిపారు. రూ.5 కోట్లతో మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.1.50కోట్లతో పార్కులు, క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తామన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ వి వి రాజేష్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులు రూపొందించిన బడ్జెట్ అంశాలు ప్రజలకు మేలు చేసేవిగా ఉన్నాయన్నారు. టెలికాం సంస్థల నుంచి మొండి బకాయిలు వసూలు చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి



సబ్ ప్లాన్ నిధులు అమలుపై కార్పొరేటర్ రూపవతి ఆగ్రహం

కార్పొరేటర్ రేగాన రూపవతి మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ ప్రాంతాలకు కేటాయించిన సక్రమంగా ఖర్చు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ,ఎస్టీ ప్రాంతాలకు జనరల్ ఫండ్‌లో కేటాయింపులు చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ ప్రకారం నిధులు ఖర్చు చేయకుంటే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్, సహాయ కమిషనర్ సి.హెచ్. తిరుమలరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం తడవడానికి వీల్లేదు

అవసరమైన టార్పాలిన్లు, గోనెసంచులు సరఫరా అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట



బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వాతావరణ కేంద్రం జిల్లాకు వచ్చే మూడు రోజుల్లో భారీవర్షాల హెచ్చరికలు చేసినందున ఖరీఫ్ కు సంబంధించి రైతులు పండించిన ధాన్యం ఏ ఒక్క గింజ కూడా తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. భారీవర్షాల నేపథ్యంలో జిల్లాలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ, రెవిన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులు పండించిన ధాన్యం సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. గ్రామాల్లో ఇప్పటికే వరి పంట కోతలు పూర్తిచేసి కుప్పలుగా వేసిన ధాన్యం నూర్చవద్దని రైతుల్లో అవగాహన కలిగించాలన్నారు. పంటకోతలు పూర్తిచేసి పనల మీద వున్న ధాన్యం కుప్పలుగా వేసి టార్పాలిన్లు కప్పి వుంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం అవసరమైన 1600 టార్పాలిన్లు పౌరసరఫరాల శాఖ వద్ద సిద్ధంగా వున్నాయని రైతులు కోరిన వెంటనే వాటిని అందజేస్తామని తెలిపారు. కళ్లాల్లో వున్న 30 వేల టన్నుల ధాన్యం తక్షణమే రైస్ మిల్లులకు లేదా గోదాములకు బుధవారం మధ్యాహ్నం కల్లా తరలించాలని ఆదేశించారు. జిల్లాలో వచ్చే మూడు రోజులూ ధాన్యం, వరికోతల పరిస్థితిపై ప్రతి గంటకూ సమాచారం సేకరించి పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్‌కు సూచించారు. టెలికాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్‌లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

జిల్లాకు భారీ వర్షసూచన

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో బుధవారం అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈనెల 19న పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా మండలాల్లో తహశీల్దార్ లు అప్రమత్తంగా వుంటూ తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, పైపులైన్ పనులను కమిషనర్ పల్లి నల్లనయ్య పరిశీలించారు. జిల్లా కేంద్రాసుపత్రిలో నూతనంగా నిర్మితమవుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను, నాణ్యతను పరిశీలించారు. ఆ తర్వాత ధర్మపురిలో బిసి కాలనీలో పైపులను పరిశీలించి నీటి పంపిణీ జరగకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే పరిస్థితిని చక్కదిద్ది తాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం రెవెన్యూ కాలనీ చేరుకొని అక్కడ రహదారుల నిర్మాణ పనులను పరిశీలించారు. స్టేడియంపేట కాలనీకి వెళ్లి అక్కడ అసంపూర్తి నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ పరిస్థితిని పర్యవేక్షించారు

సర్వీస్ కొనసాగించాలి


ప్రజాశక్తి - పూసపాటిరేగ

జిల్లాలో తొలగించిన 56 మేల్ హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలని తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు టిఎస్‌బి వర్మరాజు అన్నారు. మంగళ వారం ఆయన స్థానిక పిహెచ్‌సి ఆవరణంలో విలేకర్లతో మాట్లాడారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో రాష్ట్రవ్యాప్తంగా 920 మంది హెల్త్ అసిస్టెంట్‌లను తొలగించారన్నారు. అందులో భాగంగా జిల్లాలో రెండు దశాబ్దాలు పైబడి కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్న 56 మందిని తొలగించడం అన్యాయమని అన్నారు. వీరంతా ఉద్యోగమే జీవనాధారంగా బ్రతుకుతున్నారన్నారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యలు, కుటుంబం, పిల్లల చదువులు, బాధ్యతలు దృష్ట్యా ఈ వయసులో వీరిని సర్వీస్ నుంచి తొలగించడం చాలా దారుణ మన్నారు. ఈ తొలగింపునకు తట్టుకోలేక ఉద్యోగులు, కుటుంబీకులు ఆందోళన చెంది ఆకస్మిక మరణాలకు గురవుతున్న పరిస్థితి ఉందన్నారు. ఈ పరిస్థితిని అధికారులు, ప్రభుత్వం గమనించి ఒచాలని కోరారు. ఆయనతో పాటు బంగారుబాబు తదితరులు ఉన్నారు.

ఘనంగా బొత్స సందీప్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి నాయకులు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, బొత్స ఝాన్సీ లక్ష్మీ తనయుడు డాక్టర్ బొత్స సందీప్ బాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ధీర ఫౌండేషన్ సౌజన్యంతో సత్యా డిగ్రీ పీజీ కాలేజి ఆధ్వర్యంలో ప్రేమ సమాజంలోని వృద్ధులకు, అభయాంజ నేయ స్వామి గుడి దగ్గర ఉన్న భక్తులకు, పేర్ల వారి వీధిలో గల మూగ ఆందుల పాఠశాల విద్యార్థులకు పూల్ బాగ్ లో ప్రభుత్వ మూగ చెవిటి పాఠశాల విద్యార్థులకు సుమారు 500మందికి దుప్పట్లు, పండ్లు , అట్టలు, ఆహార పదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో బొత్స ఝాన్సీ లక్ష్మి పాల్గొని దుప్పట్లు, పండ్లు ఆహారపదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో సత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. సాయి దేవమణి, ఎన్‌సిసి కెప్టెన్ ఎం.సత్యవేణి, ధీర ఫౌండేషన్ మెంబరు రౌతు చక్రధర్, ఎం.ఉదయ్ కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పేదలకు బట్టలు పంపిణీచేస్తున్న మాజీ ఎంపి ఝాన్సీలక్ష్మి

ట్రూఅప్ ఛార్జీల భారంపై సిపిఎం నిరసన

విద్యుత్ భవన్ వద్ద బిల్లులు దహనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలకు వ్యతిరేకంగా మంగళవారం విద్యుత్ భవన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్తు బిల్లులను దగ్ధం చేశాఉ. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ అదానికి లాభాలు... ప్రజలపై భారాలా? అని ప్రశ్నించారు. విద్యుత్తు ట్రూ ఆప్ ఛార్జీ భారం రూ.16,800 కోట్లు ప్రజలపై వేయడం దుర్మార్గమన్నారు. ఇవి చాలవన్నట్లు అదానీ స్మార్ట్ మీటర్లు ఇంటింటికీ బిగిస్తున్నారని, ,ప్రతి మీటర్‌కూ రూ.7వేలు వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారని తెలిపారు. ట్రూ అప్ ఛార్జీలను ఉప సంహరించుకునే వరకు ఉద్యమిస్తామని, ప్రజలంతా ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. అనంతరం విద్యుత్తు బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాలూరి రమణమ్మ, నగర కమిటీ నాయకులు రంభ శ్రీనువాసరావు, జగదాంబ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



బిల్లులు దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పెన్షనర్ల దినోత్సవం ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్ల భవనంలోఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించారు. పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని ఉచిత కంటి వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింటి అప్పారావు, నారాయణరావు మాట్లాడుతూ పెన్షనర్లు అనేక పోరాటాలు చేసి హక్కులు సాధించుకున్నారని తెలిపారు. దినోత్సవం స్ఫూర్తితో హక్కులు కోసం కలిసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

రిటైర్డ్ ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బిపి, షుగర్, ఇసిజి పరీక్షలు చేసి వైద్యులు తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్సు కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ ఈసీ మెంబర్ వి.జగన్నాథ స్వామి మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని, యాజమాన్యం దయతో ఇచ్చే బిక్ష కాదని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు ఎం.శ్రీనివాస, జె.బి.ఎస్. మూర్తి, బి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ అధ్యక్షులు పెద్దింటి అప్పారావు

హెల్త్ ప్రొవైడర్లుగా గుర్తించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మారుమూల గ్రామాల్లో ఉంటూ ప్రాథమిక వైద్యం అందిస్తున్న గ్రామీణ వైద్యులను హెల్త్ ప్రొవైడర్లుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని ప్రాథమిక వైద్య సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.గణపతి రావు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని జిడ్డు వారి వీధిలో గల స్కాను స్కానింగ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామీణ వైద్యుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత న్యూరో సర్జన్ డాక్టర్ ఈశ్వరరావు, స్కాను స్కానింగ్ సెంటర్ డాక్టర్ సాధన జిల్లాలోని గ్రామీణ ప్రాథమిక వైద్యులకు ఆధునిక వైద్య విధానంపై అవగాహన కల్పించారు. పాథమిక వైద్య సంఘాల సమాఖ్య కార్యదర్శి గణపతిరావు మాట్లాడుతూ ప్రాథమిక వైద్యులకు సంబంధించి రాష్ట్ర ఆరోగ్య శాఖ గతంలో విడుదల చేసిన 429, 465 జీవోలను సమీక్షించి తమను హెల్త్ ప్రొవైడర్లుగా, పారామెడికల్ గా గుర్తింపు ఇవ్వాలని కోరారు. ప్రాథమిక వైద్య సంఘాల సమాఖ్య నాయకులు వై. నాగేశ్వరరావు, సత్యనారాయణ, కోటి బాబు, రమేష్ బాబు మాట్లాడారు.

అద్దె గర్భంతో గిరిజాతి ఆవుదూడ జననం

ప్రజాశక్తి-రామభద్రపురం

అద్దె గర్భం ద్వారా మైలేన గిరి జాతి ఆవుదూడ జన్మించినట్లు పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ వైవి రమణ తెలిపారు. ఆరికతోట పశు వైద్యులు సురేష్ ఆధ్వర్యాన ఈ ఏడాది మార్చి 9న గిరి ఆవుజాతి పిండాన్ని రామభద్రపురం మండలం జగన్నాధపురంలో ఎంపిక చేసి ఒక సంకరజాతి ఆవులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గర్భం దాల్చిన ఆవు ఈనెల 15న ఆరోగ్యవంతమైన గిర్‌జాతి ఆడ పెయ్యకు జన్మినిచ్చిందన్నారు. ఉత్తరాంధ్రలోనే తొలిసారిగా పిండ గర్భదారణ ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు.ఈ దూడ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు మంగళవారం జగన్నాధపురం వచ్చిన జెడి, పశు వైద్యాధికారి సురేష్ ఆవును, దూడను పరిశీలించారు. ఈ అద్దె గర్భంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఎల్ డిఎ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ ఎల్.విష్ణు, సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్, హిరణ్య, స్రవంతి, జగదీష్ పాల్గొన్నారు.



అద్దెగర్భంలో సంకరజాతి ఆవుకు జన్మించిన గిరిజాతి దూడ

సిఐటియు నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో మూతబడిన పరిశ్రమలను తెరిపించాలని, కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2017 జులై 3న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన సిఐటియు నాయకులపైనా, కార్యకర్తలపైనా పోలీసులు పెట్టిన కేసును మొబైల్ కోర్టు మంగళవారం కొట్టివేసింది. ఆ సందర్భంలో ఒకటవ పట్టణ పోలీసులు 76మందిపై కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు పెట్టిన కేసు సరైనది కాదని, ఈ కేసులో పోలీసులు చేసిన ఏ ఒక్క ఆరోపణ రుజువు కాకపోవడంతో కేసును మొబైల్ కోర్టు జడ్జి కొట్టివేస్తూ తీర్పు చెప్పారు.

హర్షం వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు, కార్యకర్తలు



కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

చీపురుపల్లి: మండలంలోని పేరిపిలో మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 87 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 38 మందికి రెటీనా చికిత్స కోసం విజయనగరంలో ఉన్న పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు, పేరిపి ఎంపిటిసి మోపాద తేజస్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు యలకల అప్పారావు నాయుడు, కరణం సత్యం, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

సస్పెక్ట్ షీట్స్ ఉన్నవారిపై నిఘా పెట్టాలి

బొబ్బిలి: సస్పెక్ట్ షీట్స్ ఉన్న నేరస్తుల నడవడికపై నిఘా పెట్టాలని మహిళా పోలీసులను పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 70మంది నేరస్తులపై సస్పెక్ట్ షీట్స్ ఉన్నాయని, వారందరి నడవడికపై నిఘా పెట్టాలన్నారు. గ్రామాల్లో నేరాలు జరగకుండా చూడాలన్నారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడి, పొట్టేలు పందేలు, పేకాట జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, ఎస్ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

రికార్డు తప్పనిసరి

బాడంగి: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూవ్‌మెంట్ రికార్డు నిర్వహించాలని ఎంపిడిఒ రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. పంచాయతీ కార్యదర్శులు ప్రధానంగా చేయాల్సిన అంశాలు గురించి వివరించారు. సచివాలయ ఎంప్లాయిస్ బయోమెట్రిక్ అటెండెన్స్ కచ్చితంగా అమలు చేయడంతో పాటు మూవ్‌మెంట్ రిజిస్టర్ కచ్చితంగా ఉండాలన్నారు.

ఆలయానికి రూ.20వేలు వితరణ

దెంకాడ: పూసపాటి రేగ మండలంలోని ఎరుకొండ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న షిరిడి సాయి బాబా దేవాలయానికి మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు రూ. 20వేలు విరాళంగా అందించారు. అక్కివరంలోని తన స్వగృహంలో మంగళవారం కమిటీ సభ్యులకు ఈ నగదును అందించారు. ఈ కార్యక్రమంలో ఎరుకొండ సర్పంచ్ గొట్టపు అప్పలస్వామి (మాస్టారు), మహిళా అధ్యక్షురాలు పీతల జయమ్మ, వార్డ్ మెంబర్ చింతపల్లి రవి, రామారావు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సోలార్ పవర్ కెమెరాలు

శృంగవరపుకోట: నేర నియంత్రణకు సోలార్ పవర్ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అర్బన్ సీఐ వి. నారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటరమణపేట జంక్షన్ వద్ద సోలార్ పవర్ కెమెరాలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఎస్ కోట సర్కిల్, బర్స్, సిమెంట్ షాపుల అసోసియేషన్ సహకారంతో సోలార్ పవర్ కెమెరాలు బిగిస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లో సర్పంచులు, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎంపిడిఒ సతీష్ సహకారంతో కెమెరాలు ఏర్పాటు చేయడానికి సహకారాలు అందజేస్తున్నామని వివరించారు.

పైపులైన్ పనులు పూర్తి చేయాలి

బొబ్బిలి: మున్సిపాలిటీలోని టిఆర్ కాలనీలో నూతన పైపులైన్ పనులు పూర్తి చేసి తాగునీరు ఇవ్వాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మిని ప్రజలు కోరారు. టిఆర్ కాలనీలో ఆమె మంగళవారం పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాత పైపులైన్ ద్వారా తాగునీరు ఇవ్వడంతో సంపూర్ణంగా అందడం లేదని, నూతన పైపులైన్ పనులు పూర్తి చేసి తాగునీరు ఇవ్వాలని కోరారు. నూతన పైపులైన్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పువ్వుల మొక్కలు, గోడ రాతలను పరిశీలించారు. ఆమెతో మున్సిపల్ అధికారులు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో అదనపు ఆదాయం

మెంటాడ: కాలిబాటలో నవధాన్య సాగుతో అదనపు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టీమాటిక్ లీడ్ ప్రకాష్ తెలిపారు. మండలంలోని కొండ లింగాలవలస గ్రామ పంట పొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలిబాటలో మొక్కజొన్న, బొబ్బర, బెండ, చిక్కుడు, తెల్ల జొన్న, బీర, ఉలవలు, ఆవాలు, గోంగూర ప్రకృతి వ్యవసాయ రైతులతో కాలిబాటల్లో వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీటీ ప్రకాష్, ఎంటి సన్యాసి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఓక్లాండ్‌లో విద్యార్థులకు హస్తకళలపై శిక్షణ

పూసపాటిరేగ : మండల కేంద్రంలోని ఓక్లాండ్ పాఠశాలలో విద్యార్థులకు మూడు రోజులు పాటు హస్తకళల శిక్షణ, ప్రదర్శన ఇస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ పాల్ ఫ్రెమింగ్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో హస్తకళ శిక్షణ కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో మంచి నైపుణ్యం కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కళాకారులకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తమ పాఠశాల ఉన్నతమైన విద్యతోపాటు భారతదేశ సంస్కృతి వారసత్వ విలువలు అందిస్తామని ప్రిన్సిపాల్ రవి తెలిపారు.

జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

మెరకముడిదాం: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన బందపు ఈశ్వర్ ప్రసాద్ అనే ఆర్మీ జవాను సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం భీమవరంలో పోలీస్, ఆర్మీ సిబ్బంది అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి సిఐ జి శంకరరావు, బుదరాయవలస ఎస్ఐ జె. లోకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో విశ్రాంతి భవనం ప్రారంభం

నెల్లిమర్ల: జరజాపుపేటలో దాతల సహకారంతో శ్మశాన వాటికలో నూతనంగా నిర్మించిన విశ్రాంతి భవనాన్ని మంగళవారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపకారాగారం ఆకస్మిక తనిఖీ

శృంగవరపుకోట: జిల్లా జడ్జి బి సాయి కళ్యాణ చక్రవర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్‌కుమార్ ఎస్‌కోట ఉపకారాగారాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది నిర్వహించే విధులు, ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత, ఖైదీలకు అందజేయాల్సిన ఉచిత న్యాయ సేవల అంశాలను గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వ తరఫున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. దీనికి సంబంధించిన వివరాలను సబ్‌జైల్ సూపరింటెండెంట్ ద్వారా, లేదా జైలు సందర్శన న్యాయవాదికి గానీ దరఖాస్తు చేయాలన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

విజయనగరం టౌన్: నగరంలోని దాసన్నపేట వాటర్ ట్యాంకు వద్ద అనధికారిక నిర్మాణాన్ని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రణాళిక అధికారులు తొలగించారు. వాటర్ ట్యాంక్ ప్రాంతంలో అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు సమాచారం మేరకు అధికారులు స్పందించి తొలగించారు. నిర్మాణం కోసం సిద్ధం చేసిన సామాగ్రిని అక్కడి నుంచి తొలగించారు.

42 ద్విచక్ర వాహనాలు వేలం

విజయనగరం కోట: గత నాలుగేళ్లగా వివిధ కేసుల్లో పట్టుబడి శాశ్వతంగా ఉండిపోయిన 42 ద్విచక్ర వాహనాలను మంగళవారం టూటౌన్‌స్టేషన్‌లో సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేలం వేశారు. ఈ వేలంపాటలో ఒక్కో బండికి ప్రభుత్వ నిర్ణయించిన ధరతో ప్రారంభించారు. బండిని కొనుక్కున్న రేటుతో పాటు అదనంగా 18 శాతం జిఎస్‌టి ఉంటుందని తెలిపారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, మున్సిపల్ సిబ్బంది కొనుగోలుదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

భోగాపురం : డ్రగ్స్‌కు విద్యార్థులంతా దూరంగా ఉండాలని సిఐ ఎన్‌వి ప్రభాకర్ అన్నారు. సంకల్ప కార్యక్రమంలో భాగంగా మండలంలోని సవరవిల్లి సమీపంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటివి సేవించిన వారి జీవితమే నాశనం అవుతుందని తెలిపారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని మిందివలస, రామచంద్రపురం, గులివిందడ గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.విజయ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 22 వరకు తుపాను హెచ్చరిక నేపథ్యంలో వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కోత కోసిన ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. ఎఒ మాధురి శరణ్య మాట్లాడుతూ వరి పంటగా చేసిన అపరాల పంటను ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సిహెచ్. రామిరెడ్డి, ఎఇఒ గణేష్, రైతులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి

ప్రజాశక్తి- రేగిడి

భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర పరిశీలకులు కె.నాగరాజు, డిఎల్‌డిఒ కె. హేమ సుందర్, జిల్లా పరిశీలకులు ఎస్ లోకనాథం అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో రెండో రోజు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుస్థిరమైన లక్ష్యాలతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. మానవ మనుగడకు ఇబ్బందులు కలగకుండా విద్యా, వైద్యం, వ్యవసాయం, పేదలకు సంక్షేమ పథకాలు వంటివి అమలపై పాలకవర్గాన్ని, ప్రజలను భాగస్వాములు చేస్తేనే అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, ఎంపిడిఒ శ్యామల కుమారి, ఇఒపిఆర్‌డి ఏవి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గత రెండు రోజులుగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పని చేయాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంఇఒలు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రేగిడి: మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు కె. నాగరాజు

దెంకాడ: ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారుల సమన్వయంతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి చెందుతాయని శిక్షణా తరగతుల ప్రత్యేక అధికారి సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, గ్రామ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి రెండవ రోజు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులు ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులదే కీలక పాత్ర అని అన్నారు. పినతాడివాడ కార్యదర్శి టి వెంకట్రావు వీరికి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వైభవాని, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: గ్రామాలాఅభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర పరిశీలకులు కె.నాగరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను నిబద్ధతతో అమలు చేసి పేదరిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిట్ ట్రైనింగ్ మేనేజర్ ఎస్ లోకనాథం, ఎంపిపి ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ, కరణం సుదర్శనరావు, ఎంపిడిఒ లోపింటి త్రినాథరావు, ఇఒపిఆర్‌డి కెల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి వస్తున్న నిధులను సక్రమంగా వినియోగించేలా చూడాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ భవనంలో జరుగుతున్న శిక్షణ తరగతులలో మంగళవారం ఎమ్మెల్సీ పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న నిధుల్ని ఏ విధంగా ఉపయోగించాలో, ఏ ప్రాతిపదికన అమలు చెయ్యాలో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సతీష్, ఇఒపిఆర్‌డి లక్ష్మి, మండలంలో అన్ని గ్రామాల సర్పంచులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గెడ్డవలసకు జ్వరమొచ్చింది..

● ఇంటింటికీ జ్వరపీడితులు ● గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని గెడ్డవలస గ్రామంలో గత వారం రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఇద్దరు, ముగ్గురు మంచం పట్టారు. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో కొందరు రాజాంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరి కొంత మంది గ్రామంలో ఉన్న ఆర్‌ఎంపిలతో నెట్టుకొస్తున్నారు. వారం రోజులుగా ప్రతి ఇంట్లోనూ విష జ్వరాలు, మోకాళ్లు, ఒంటి నొప్పులతో బాధపడుతున్నా వైద్యులకు పట్టకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. గ్రామంలో పరిస్థితిని వివరించినా సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా ఏఎన్‌ఎంలతో సర్వే చేయించి చేతులు దులుపుకుంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని, వాతావరణ పరిస్థితులు, శానిటైజేషన్ లోపంతో జ్వరాలు పెరుగుతున్నాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా మంగళవారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి జ్వర పీడితుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్నట్లు డిఎంహెచ్ఒ తెలిపారు. వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా జ్వరాలు ఉన్నాయని, మలేరియా, డెంగీ వంటి లక్షణాలు ఎవరికీ లేవని వివరించారు. తక్షణమే గ్రామంలో పారిశుధ్య నిర్మూలనకు చర్యలు చేపట్టి, ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని అందుబాటులో ఉన్న పిహెచ్‌సిలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వలీఖాన్‌కు నివాళి

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర విభాగాతిపతిగా పనిచేస్తూ అకాల మరణం చెందిన షేక్ వలీఖాన్‌కు మంగళవారం కళాశాల సెమినార్ హాల్లో ఘన నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన షేక్ వలీ ఖాన్ 2021 నుంచి మాథ్స్ విభాగాధిపతిగా, ఎన్ఎస్ఎస్ పిఒగా, నాక్ ఫస్ట్ క్రైటీరియల్ బాధ్యత తీసుకొని, ఎన్‌సిసి కేర్ టేకర్, సిపిడిసి కన్వీనర్ గా పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తూ కళాశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. అటువంటి వలీఖాన్ ఈనెల 12 రాత్రి గుండె నొప్పితో హఠాన్మరణం పొందడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, కళాశాల అధ్యాపకులు స్వామినాయుడు, సుధీర్, శ్రీలక్ష్మి, ఈరన్న, భాస్కర్, శ్రీనివాసరావు, రామకృష్ణ, అప్పల రాజు, హైమావతి, లక్ష్మణ్, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇంఛార్జి పంచాయతీ కార్యదర్శి లెంక తవుడు అన్నారు. మండలంలోని గరికిపేట గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ పనులకు సంబంధించిన నివేదకను చదివి వినిపించారు. అనంతరం సర్పంచ్ భర్త, వైసిపి నాయకులు గుంటమాని ఉమా మాట్లాడుతూ గ్రామంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులకు ఆటంకం లేకుండా చేయాలని చెప్పారు. మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు ద్వారా గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అందరం కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు పంచాయతీ పాలక వర్గం ఆమోదం తెలిపింది. ఈ సభలో మాజీ సర్పంచ్ గుంటమాని రాజబాబు, వార్డు మెంబర్లు తిమనాన ఆదినారాయణ, బొద్దాన అప్పన్న వైసిపి నాయకులు మహంతి వెంకటరావు, మహంతి కృష్ణ, మహంతి పైడినాయుడు, మహంతి అప్పలనాయుడు, టిడిపి నాయకులు చింతపల్లి రాజినాయుడు, జనసేన నాయకులు చింతపల్లి అప్పలస్వామి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తాళ్లపూడి సుప్రజ, ఫీల్డ్ అసిస్టెంట్ మహంతి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి తవుడు

క్షయపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

క్షయ వ్యాధిపై అందరికీ అవగాహన ఉండాలని గోవిందపురం పిహెచ్‌సి వైద్యులు కె. త్రినాదరావు అన్నారు. వంద రోజుల్లో క్షయ నిర్మూలనలో బాగంగా మంగళవారం మండలంలోని గోవిందపురం పిహెచ్‌సి పరిదిలోని గుంపాం, తొత్తడాం, కొవ్వాడ గ్రామాల్లో భోగాపురం టిబి యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయవ్యాది నివారణ, వ్యాది లక్షణాలు, వ్యాది నిర్ధారణ పరీక్షలుతోపాటు ఉచితంగా మందులు పంపిణీపై అవగాహన కల్పించారు. టీబీ వ్యాదిని నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు త్రినాదరావు, వెంకట సుధ, సూపర్ వైసర్లు ఎం.బాలాజీ, శ్రీకాంత్, సిహెచ్.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పిఎస్ ఉషా, పాల్గొన్నారు.

105 మందికి క్షయ పరీక్షలు

కొత్తవలస: వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని తుమ్మికాపల్లిలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సర్పంచ్ విరోతి కొండలరావు అధ్యక్షతన వైద్య సిబ్బంది 65 మందికి ఎక్స్‌రే, టెస్టులు, 40 మందికి కఫం పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్ వైజర్ బి. శ్రీనివాస్, వైస్ సర్పంచ్ అడ్డురి సతీష్, ఎంపిటిసి పిల్లా లక్ష్మి, మాజీ సర్పంచ్ పిల్లా అప్పలరాజు, నీటి సంఘం ప్రెసిడెంట్ జవ్వాది వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ అప్పికొండ సన్యాసిరావు, గ్రామపెద్దలు చిక్కాల సత్యనారాయణ, బొబ్బర ఈశ్వరరావు, నాగరాజు, హెల్త్ సూపర్ వైజర్స్ నరసింహారావు, పద్మావతి, ఈశ్వరరావు, సత్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- మెంటాడ

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారమవుతాయని తహశీల్దార్ కె.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మెంటాడ, లోతుగెడ్డ గ్రామాలలో ఆయా సచివాలయాల వద్ద రెవెన్యూ సదస్సలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు,పేరు మార్పులు, మ్యూటేషన్ సమస్యలు మొదలగు దరఖాస్తులను పరిశీలించి తక్షణ పరిష్కార దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సర్పంచ్ రేగిడి రాంబాబు, నీటి సంఘం అధ్యక్షుడు రెడ్డి రాజగోపాల్, పాల్గొన్నారు.

వేపాడ: మండలంలో ముకుందపురం, బల్లంకి గ్రామాల్లో మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జె. రాములమ్మ మాట్లాడుతూ ఎక్కువుగా రైతుల నుంచి మ్యుటేషన్‌కు సంబంధించిన దరఖాస్తులు వస్తున్నాయని వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. ఈ రెవెన్యూ సదస్సులో ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి గొంప తులసి, సర్పంచ్ బల్లంకి లక్ష్మి, ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి రైతులు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: రైతు సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని కెరటాం, నెలివాడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం రైతుల ద్వారా అర్జీలు తీసుకొనేందుకు రెవెన్యూ సదస్సులు వేదికగా ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కెరటాం సర్పంచ్ నంబూరి రాజేష్ (బుజ్జి రాజు), నెలివాడ సర్పంచ్ తాళ్ళపూడి కీర్తి, ఆర్ఐ హరికృష్ణ, విఆర్ఒ ప్రసాద్, రైతులు బడిబట్ల శివాజీ, తాళ్ళపూడి అప్పలనాయుడు, వనపర్తి ఆది, చంద్ర శేఖర్, కునుకు నారాయణప్పడు తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లు చర్చలు వాయిదా దుర్మార్గం

నెల్లిమర్ల: జ్యూట్ మిల్ చర్చలు వాయిదా వేయడం దుర్మార్గమని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. మంగళవారం ఆయన జ్యూట్‌మిల్ చర్చలకు విశాఖపట్నం లేబర్ కమిషనర్ వద్ద హాజరవ్వగా జ్యూట్ యాజమాన్యం గైర్హాజర్ కావడంతో చర్చలు ఈ నెల 27కి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామారావు లేబర్ అధికార్లు జ్యూట్ యాజమాన్యానికి వత్తాసు పలకడం వల్ల చర్చలకు గైర్హాజరు అవుతుందన్నారు. గత 7 నెలలుగా జ్యూట్ యాజమాన్యం అక్రమంగా లాక్ అవుట్ చేసి కార్మికులను ఇబ్బంది పెడుతుంటే ప్రభుత్వానికి కనిపించ లేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో కూడా జ్యూట్ కార్మికులకు న్యాయం జరగలేదని మండిపడ్డారు. కలెక్టర్ జోక్యం చేసుకొని ఈ నెల 25న క్రిస్మస్ సందర్భంగా కార్మిక క్రిస్టియన్ సోదరులకు బోనస్ ఇవ్వాలని, మిల్లు ను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో కార్మికులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ చర్చల్లో జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొండల కరువులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన షర్మిల పుట్టినరోజు వేడుకలు

విజయనగరంకోట: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల పుట్టిన రోజు వేడుకలను మంగళవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి నాయకులంతా స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు ఎం.విద్యాసాగర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో షర్మిలను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. జిల్లాలో కాంగ్రెస్ అభివృద్ధికి ప్రతి నియోజకవర్గ నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శృంగవరపుకోట కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ డాక్టర్ గేదెల తిరుపతిరావు, చీపురుపల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ అడ్డాల రామచంద్రరాజు, జిల్లా మైనార్టీ నాయకులు సమీర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఈ నెల 14, 15 తేదీలలో గుడివాడలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో ఎస్‌కోటకు చెందిన ఇందుకూరి సుబ్బలక్ష్మి, ఎంఎస్ఎన్ మూర్తి, ఎన్.డి వర్మ, గేదెల త్రినాథ్, పి. సుధీర్ వర్మ, మైలపూడి సూర్యనారాయణ మూర్తిలు బంగారు పతకాలు సాధించారు. వీరిని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం అభినందించారు. ఫిబ్రవరిలో రాజస్థాన్‌లో జరగబోవు జాతీయస్థాయి పోటీలలో మరిన్ని బంగారు పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులకు కోచ్ మేనేజర్‌గా వ్యవహరించిన ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించడం గర్వంగా ఉందన్నారు.



అవార్డుతో గురుచందన

రాష్ట్రస్థాయి పోటీల్లో కెజిబివి ప్రతిభ

నెల్లిమర్ల: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో కెజిబివి విద్యార్థి ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ బి.ఉమా తెలిపారు. గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 19 బేస్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో వై.గురు చందన తృతీయ స్థానం సాధించినట్లు ఆమె మంగళవారం తెలిపారు. గురు చందన కెజిబివిలో సీనియర్ ఇంటర్ చదువుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో బాటు పలువురు అభినందించారు.

ఏకగ్రీవంగా బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించిన 2024 -25 బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. 2023 -24 ఏడాదికి సంబంధించి ప్రారంభ నిల్వ రూ.2.11కోట్లు చూపించగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.57కోట్లు అంచనా బడ్జెట్ వేశారు. రూ.2.55కోట్లు సవరణ బిల్లుగా చూపించారు. అంచనా బడ్జెట్ రూ.2.55కోట్లు చూపించారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి నికరం మొత్తం రూ.31.33కోట్లు చూపించగా, అంచనా మొత్తం బడ్జెట్ రూ.17.33కోట్లు చూపించారు. సవరణ బిల్లు మొత్తం రూ.18.75కోట్లుగా చూపించారు. ఈ బడ్జెట్ సమావేశంలో ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - వంగర

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ డి.ధర్మరాజు, ఎఇ టి.కన్నబాబు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వివిధ గ్రామాలలో ప్రధానంగా వరి నూర్పుడి పనులు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నూర్పుడు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు ఇవ్వాలని, సూచించారు. ఈ మేరకు ఎఇ కన్నబాబు ఎం సీతారాంపురం, మద్దివలస, రాజులు గుమ్మడ గ్రామాలలో మంగళవారం పర్యటించి ఈనెల 21వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని పంటలను భద్రపరుచుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.

బొబ్బిలి: రానున్న ఐదు రోజులలో వర్ష సూచన ఉన్న కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏడి మజ్జి శ్యామసుందర్ ఒక ప్రకటనలో రైతులను కోరారు. కోసేసిన వరి పంటను కుప్పలు వేసుకోవాలని, నూర్పిడి చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, ఇంటి అవసరాలకు ఉంచే ధాన్యాన్ని భద్ర పరుచుకోవాలన్నారు. వరి కోతలను వాయిదా వేసుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

చోడమ్మ అగ్రహంలో చోరీ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చోడమ్మ అగ్రహారానికి చెందిన మొల్లు సత్యం ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. రెండున్నర తులాల బంగారం, రూ.7200 నగదు అపహరించుకుపోయినట్లు పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. సత్యం తన భార్య పని నిమిత్తం సోమవారం బయటకు వెళ్లి మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తీసి ఉండటంతో చోరీ జరిగిందని తెలుసుకుని గగ్గోలు పెట్టారు. వెంటనే పోలీసులు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ దుర్గప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరుని పరిశీలించారు. బంధువులే చోరీ చేసి ఉంటారని అనుమానంతో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకున్నట్లు సమాచారం.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- విజయనగరం కోట

గంజాయి కలిగి ఉన్న ఇద్దరిని అరెస్టు చేశామని ఒకటో పట్టణ సిఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు పట్టణంలోని గూడ్స్ షెడ్ సమీపంలో తనిఖీలు నిర్వహించగా ఉడాకాలనీకి చెందిన సప్ప పవన్ కళ్యాణ్, యలగడ మురళీలు పట్టుబడ్డారన్నారు. వీరిద్దరూ పాత నేరస్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో అమ్ముతుంటారని చెప్పారు. పట్టుబడిన వీరిద్దరి వద్దనుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో చురుగ్గా పాల్గొన్న ఎస్ఐ ప్రసన్నకుమార్‌ను, కానిస్టేబుల్‌ను అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- బొబ్బిలి

పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో మంగళవారం పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు రౌతు రామమూర్తి వివరించారు. మెడికల్ రీయంబర్స్ ఇవ్వాలని, 2018 జూలై ఒకటి నుంచి గ్రాడ్యుటీ ఇవ్వాలని, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లో రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయానికి స్థలం ఇవ్వాలని కోరారు. వృద్ధాశ్రమం ఏర్పాటుకు ఖాళీగా ఉన్న హాస్టల్ భవనాన్ని కేటాయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే బేబినాయన స్పందిస్తూ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లో రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయానికి స్థలాలు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తులు ఇస్తే ఆయా తహశీల్దార్‌లకు పంపిస్తామని చెప్పారు. అనంతరం సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కరి సత్యనారాయణ, ఎల్.జగన్నాథం, పి.సత్యంనాయుడు, సిహెచ్ శ్రీరామ్మూర్తి, పెన్షనర్లు పాల్గొన్నారు.